

కప్పగంతుల మల్లికార్జునరావు

జైలు గడపదాటి యివతలికొచ్చి వెనక్కి తిరిగి చూచాడు కనకయ్య. తనను ఆరునెలలు పోషించిన పవిత్రక్షేత్రం!... వదిలి వెళ్లాలంటే బాధగావుంది. అయిష్టంగానే అడుగు ముందు కేసేడు.

చల్లటి గాలి ఒంటికి తగిలింది. ప్రాతఃకాలపు చిరుయెండ శరీరానికేదో వింత అనుభూతి నిచ్చింది. కనిపించినంత మేరా కళ్ళు తనివితీరా చూస్తున్నాయి. స్వేచ్ఛ... ఆరు నెలల తర్వాత తిరిగి స్వేచ్ఛ!... అయినా కనకయ్య మనసు ఆనందంతో పొంగిపోవటంలేదు. మనసు దిగులుతో నిండిపోయింది. జరిగిపోయినదానిక్కాదు ఆ దిగులు – జరగబోయేదాన్ని గురించి...

తెల్సినవాళ్ళు ఎదురయ్యారు. తనని చూడగానే ఆప్యాయంగా పలకరిస్తారని ఆశించాడు కనకయ్య. పలకరించలేదు సరికదా, అతనేవెళ్ళి పలకరించబోతే మొహం చిట్లించి తప్పుకొన్నారు. కనకయ్యమొహం చిన్నబోయింది. మనసులో ఏదో అనుమానం! నీతి తప్పిన మనిషికింద, తాగుబోతుగా, రౌడీగా తన్నంతా జమకట్టటం లేదు కదా?

రిక్షా యజమాని చిదంబరం, తనకు రిక్షా ఇవ్వటానికి నిరాకరించినప్పుడు కాని అతని అనుమానం ధృవపడలేదు.

హద్దు తప్పిన 'డెమోక్రసీ'లో సామాన్యుడి కోపంలా, సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. భారత దేశంలో సమస్యల్లా గాలి, ఆచెంపా యీచెంపా వాయించేస్తున్నది. విద్యార్థుల విచ్చలవిడి ప్రవర్తనలాగా కనకయ్య కాళ్ళు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి.

రాత్రి జైల్లోతిన్న ముద్ద. ఆకలి కళ్ళముందు నిల్చి 'నా సంగతేం చేశావ్?' అని ప్రశ్నించింది. కళ్ళు మూసుకొని పంపునీళ్లు కడుపుకు పట్టించి ఆకలినోరు నొక్కేశాడు.

ఎక్కడికెళ్లాలి? ఏం చేయాలి?

తన్నంతా తాగుబోతుకిందా, రౌడీకిందా జమకట్టేరన్నది స్పష్టం. తెల్సినవాళ్లెవరూ తనకు పనివ్వరు.

నిజానికారోజు తను తాగలేదు. తాగి ఎవరినీ కొట్టబోనూలేదు. అయితే యీ నేరానికే తను ఆరునెలలు జైల్లో గడిపింది.

కనకయ్య ముందుకు నడుస్తూనేవున్నాడు.

అతని ఆలోచనలు మాత్రం వెనక్కే పరుగెత్తేయి.

*   *   *

తండ్రి బతికున్నంత కాలం, కనకయ్య కష్టమంటే ఏమిటో, బాధ్యత అన్న పదానికి అర్థమేమిటో తెలీకుండా పెరిగాడు. తండ్రి పోయాక బతకటానికి మార్గం ఏమిటో తెలీలేదు. పైసా ఆస్తిలేదు. ఉండటానికి ఆశ్రయంలేదు. 'నా' అని చెప్పుకోటాని కెవరూ లేదు.

ఎవరో చెప్పేరు – పట్నంలో రిక్షా తొక్కితే డబ్బు వస్తుందని.

ఆ వూ రొచ్చాడు. ఎవర్నో పట్టుకొని రిక్షా అద్దెకు సంపాదించాడు.

ఓపిగ్గా రిక్షా తొక్కగల డతను. అయితే ఆ వృత్తిలో 'షైన్' కావాలంటే ఆ వొక్క 'క్వాలిఫికేషన్' చాలదు. తాగాలి – తార్చాలి – అవసరమైతే కొట్లాటలకు సిద్ధపడాలి – నయానో భయానో తోటి వాళ్ళందర్నీ మంచి చేసుకోవాలి.

అయితే కనకయ్య స్వతహాగా మంచి వాడు. వచ్చిన బేరాన్ని వదిలేవాడుకాదు. ఓ పైసా తక్కువైనా వొప్పుకొనేవాడు.

ఇతరుల కన్నుకుట్టింది. పోటీకి దిగేరు. అతను రూపాయంటే అర్ధరూపాయి. అవ హేళనలు – అల్లర్లు. వాళ్ళ పోటీని తట్టుకోటం, వాళ్ళను మంచి చేసుకోవటం కష్టంగానే తోచింది.

ఆరోజు... యిదే విషయాన్ని ఆలోచిస్తూ రైలుగేటు ఓవర్ బ్రిడ్జి దగ్గర రిక్షా నాపుకొని కూర్చొని వున్నాడు...

రాత్రి పదిగంటల వేళ–

అవినీతి కళ్ళుతెర్చే సమయం–

దగ్గర్లోవున్న కిల్లీకొట్టు దగ్గర ఏదో ఘర్షణ జరుగుతోంది.

కొట్లాట కిలీకొట్టు యజమానికి – ఒక పోలీసుకు.

కిల్లీకొట్టు యజమాని ఎక్కిన 'గుర్రం' అడ్డమాపులేకుండా దౌడు తీస్తున్నది. నీతిమీద, అరాచకంమీద, అన్యాయాలమీద ఏకధాటిగా 'నిజాలు' పలికేస్తున్నాడు.

తాగేవుకనుక స్టేషనుకు నడవమంటాడు పోలీసు. కిల్లీకొట్టతను నడిచే స్థితిలోలేడు. అతనెక్కిన గుర్రం పరుగెత్తుతూనే వుంది.

మాటామాటా పెరిగింది. కిల్లీ కొట్టతను సోడాసీసా తీసుకొన్నాడు ఆయుధంగా. నిముషం ఆలస్యమయితే అటో యిటో తేలేదే.

చూస్తున్న కనకయ్య వూరుకోలేక మధ్యకు వెళ్లేడు. పోలీసుకు తగిలే దెబ్బను తప్పించాడు కాని తనుమాత్రం, వేసిన కాలును వెనక్కు తీసుకోలేక పోయాడు.

కేసు బనాయించి కనకయ్యను సాక్ష్యం వేసుకొన్నాడు పోలీసాయన. కాగితంయిచ్చి సంతకం చేయమన్నాడు. 'నాకొద్దు బాబోయ్ దణ్ణం' అని రెండుచేతులు జోడించిన కనకయ్యను 'యిదేం పోలీసు వ్యవహార మనుకొన్నావా, నీ సొంత పననుకొన్నావా? ఊఁ సంతకంపెట్టు' అని బెదిరించి, వేలిముద్ర వేయించుకొన్నాడు. కిల్లీకొట్టతను మింగేసేలా గుడ్లురిమి చూచాడు.

ఆ తర్వాత అయిదురోజులు సవ్యంగానే గడిచిపోయాయి.

ఆరో రోజు – క్రితం రాత్రంతా రిక్షా తొక్కి, కళ్ళల్లో నిద్రను నింపుకొని పొద్దున్నే యింటికొచ్చాడు.

వాకిలి దగ్గర పోలీసు! ఆరాత్రి సంఘటన గుర్తుకొచ్చింది కనకయ్యకు. అయితే యీ పోలీసు – ఆనాటిరాత్రతనుకాదు.

కనకయ్యను చూస్తూనే, పోలీసతను స్టేషనుకు నడవమన్నాడు. కారణం అడిగితే – 'అన్నీ స్టేషన్లో చెప్తారు పద' అని తీసికేళ్ళేడు.

స్టేషన్లో, ఆనాటిరాత్రి పోలీసు నవ్వుతూ ఆహ్వానించాడు కనకయ్యను. కూర్చోబెట్టి కుశలప్రశ్న లడిగాడు. కనకయ్యకు ధైర్యం వచ్చింది. 'సాచ్యం చెప్పాల్సిందేనా బాబూ?' అన్నాడు. అతను నవ్వేడు తియ్యగా.

ఆ రోజంతా కటకటాల వెనుక కాలం గడిచిపోయింది కనకయ్యకు. సాక్ష్యం చెప్పటానికి తనను కటకటాలవెనుక ఎందుక్కూర్చోపెట్టాలో అర్థం కాలేదు కనకయ్యకు. అడిగి తెల్సుకొందా మనుకొంటే చెప్పేదెవరు?

మర్నాడు, ఆవైపు, ఈవైపు, వెనుక వైపు– ముగ్గురు భటులు వెంటరాగా, రాజుగారు కొలువు కూటానికి తరలి వెళ్ళినట్లు కనకయ్య కోర్టుకు వెళ్లేడు. ఆ తర్వాత బోనులో నిల్చున్నాడు.

'నువ్వు తాగేవా ఆరోజు?' నల్లగౌను తొడుక్కున్న న్యాయవాది కనకయ్య దగ్గర కొచ్చి నిదానంగా. తియ్యగా అడిగేడు.

'ఏరోజు?' అని అడగలేదు కనకయ్య.

'నా కలవాట్లే ద్దొరా' అన్నాడు కనకయ్య వినయంగా.

'తాగి కిల్లీకొట్టు యజమాని కేశవరావును కొట్టబోయావు కదూ?'

కనకయ్య కంతా తికమకగా కన్పించింది.

'మాట్లాడవేం?'

'ఎంతమాట దొరా! కిల్లీకొట్టు యజమానిని నేను కొట్టబోలేద్దొరా. ఆ రైలు గేటుకాడి కిల్లీకొట్టాయనే ఈ పోలీసు బాబును కొట్టేబోతే అడ్డంబోయాను–'

నల్లగౌను నాయ్యవాది న్యాయమూర్తివైపు చూచి చిరునవ్వు నవ్వేడు.

'ఇది కోర్టు. ఇక్కడ అబద్ధం ఆడకూడదని తెలియదుకదూ నీకు?' న్యాయవాది కంఠంలో కఠినత్వానికి కాగితం పువ్వులా వణికిపోయాడు కనకయ్య.

'ఊహూ–'

'ఐ. సీ' గర్వంగా నవ్వేడు నాయవాది– 'అందుకేనన్నమాట యిన్ని అబద్ధాలు చెప్పేవు?'

ఇప్పటికి విషయం కాస్త బోధపడింది కనకయ్యకు.

'నువ్వు ఫలానారోజు తప్పతాగి కిల్లీకొట్లో సోడాతాగి డబ్బులడిగిన యజమాని కేశవరావుని కొట్టబోయావు. నీ నేరాన్ని వొప్పుకుంటావా?'

పూర్తిగా అర్థమయింది కనకయ్యకు. భయంతో వణికిపోయాడు. అసహాయుడై ఏడ్చాడు.

'అన్యాయం బాబూ. నాకేం తెలీదు. అంతా అబద్ధం – ఆ కిల్లీకొటాయనే పోలీ

సాయన్ని కొట్టబోయాడు. నేను అడ్డం ఎల్లేను. అడ్డం ఎల్లిన నాకు తగిలిందా దెబ్బ. సూసిందాన్ని సెప్పటానికి సాచ్యమేసుకొన్నా రనుకొన్నా కాని, నేనే తాగి కొట్టేరంటా రనుకోలేదు. దర్మప్పెబో... నన్ను రచ్చిం చండి...'

'ఇంతకన్నా నువ్వు న్యాయపీఠానికి చెప్పుకొనే దేమన్నా వుందా?'

'ఇంకేముండదిబాబూ. దర్మప్పెబువులు నన్నన్నాయం సేయకండి. తాగనోణ్ణి తాగే ననకండిబాబూ. కావాలంటే ఆ పోలీసాయన్ని పిల్చి నిజం కనుక్కోండి_'

'దట్స్ ఆల్ రైట్_'

ఆ మాటలకు అర్థం బోధపడలేదు కనకయ్యకు.

ప్రాసిక్యూషన్ సాక్షిని పిలిపించారు కోర్టువారు. ఆ వచ్చిన సాక్షినిచూచి విస్తుపోయాడు కనకయ్య. ఆరోజు తాగి కొట్టబోయి నతనే!

'కిల్లీకొట్టు కేశవరావుగారు నీ కేమవుతారు?'

'మా మామయ్యండీ_'

'ఆయన్ని నిందితుడు కొట్టబోతుండగా నువ్వు చూశావా?'

'చిత్తం. చూచానండి_'

అలాగే ఎన్నో అబద్ధాలను నిజాలుగా చెప్పిపోయాడు.

కనకయ్య కంతా మాయగా కన్పించింది. అస లింతకీ ఆ కేశవరావు ఎవరు? తాగి కొట్టిన పెద్దమనిషి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పిపోయాడు. సాక్ష్యం చెప్పటానికే అంగీకరించని తను దోషిఅయ్యాడు. కనకయ్య కీ ప్రపంచం అంతా మోసమయంగా, అన్యాయాలకు నిలయంగా కన్పించింది. ఏడుపొచ్చింది - కోపం వచ్చింది - జాలి కలిగింది.

రెండో సాక్షిని పిలిచారు.

అతనే_ఆనాటిరాత్రి పోలీసాయన. కనకయ్యలో ఏదో ఆశ.

'నీ పేరు వెంకటస్వామేనా?'




'చిత్తం_'

'నువ్వు పట్టుకొన్నప్పుడు యితను తాగున్నాడా?'

'చిత్తం_'

'కిల్లీకొట్టు కేశవరావును కొట్టబోతుండగా నువ్వు చూచావా?'

'చిత్తం_'

కనకయ్యకు భూమి తల్లక్రిందులైనట్లు తోచింది. న్యాయవాది తల కిందపెట్టి, కాళ్లు పైకెత్తి మాట్లాడుతున్నట్లు_సాక్ష్యం చెప్పేవారంతా అలాగే నిలబడి సాక్ష్యం చెపుతున్నట్లు కళ్ళకు_నిపించింది. 'అబద్ధం... అన్యాయం' అని కనకయ్య హృదయం బిగ్గరగా అరిచింది. అతను మాత్రం పెదవి విప్పలేదు. కళ్ళప్పగించి అందరివైపు చిత్రంగా, వింతను చూచినట్లు చూస్తూవుండి పోయాడు.

అంతా చదువుకొన్నవాళ్లు. తను ఏమీ లేని అభాగ్యుడు.

తనా రోజు చూచింది ఒకవేళ అబద్ధమేమో? వాళ్ళు చెప్పుతున్న దే నిజమేమో!.. కాకపోతే యింతమంది అబద్ధం చెప్తారా?

అంతా అయ్యాక 'నువ్వు చెప్పే దింకేమైనా వుందా?'

'ఇంకేమీలేదు దర్మప్పెబో. మిమ్మల్నందర్ని సూసేక నాకు గేనం వచ్చింది. ఆరూ మీరూ సెప్పిందే నిజం. నేను సెప్పినవన్నీ అబద్దాలు. మీయిట్టంవచ్చినట్లు సేయండి_' అని గట్టిగా అరవాలనిపించింది కాని అరవలేదు, అంతరాత్మ అడ్డంవచ్చింది. అది చస్తూ చస్తూ వుంది.

'ఆరునెలలు జైలు' అన్నప్పుడు ఆశ్చర్యపోలేదు కనకయ్య!

* * *

నడిచి నడిచి కాళ్ళు నొప్పులు పుట్టి ఆగిపోయాడు కనకయ్య. సాగిసాగి ఆలోచనలు స్తంభించిపోయాయి.

సాయంకాలమయింది. దరిద్రుడి ఆకలిలా సూర్యుడు పెరిగిపెరిగి, పడమట పడబోతున్నాడు.

ఎక్కడికెళ్లాలి? ఏంచేయాలి?... ప్రశ్నలు.

'నా సంగతేం చేశావ్?' ఆకలి.

ఎమర్జన్సీ వచ్చినప్పటి సమైక్యతలా ఆలోచనలన్నీ కల్సి వొక్క_సారి వచ్చాయి.

'ఆఁఅది' అనుకున్నాడు చివరికి. ఆకలిని జయించి కాలు సాగించాడు హుషారుగా.

ఎదురుగ్గా దేముడు! వెతకపోయిన తీగే ఎదురుగ్గా వస్తోంది.

'దణ్ణం మహాప్పెబో_'

వెంకటస్వామి కంగారుపడ్డాడు - భయపడ్డాడు_చివరికి నవ్వేడు.

'మీ దయవల్ల ఆర్నెల్లు ఆయిగా గడిసిపోయింది. పొద్దుట్నే వదిలేసేరు. ఇంతవరకు తిండిలేదు. మీరే కాపాడాల_'

వెంకటస్వామి భయం తగ్గింది. కంగారుపోయింది. సిసలైన నవ్వు గర్వంగా నిల్చింది మొహంలో.

'అదేమిటోయ్. నేనేంచేసినా ఎదుటి వారి మేలుకోరే చేస్తాను. అసలు నా డ్యూటియే అది. నీలాంటివాడికి సేవ చేయటంకన్నా నాక్కా_వల్సిందేముంది? కానియ్ చెప్పు.

ఏంచేయమంటావు నన్ను?' కోపమొచ్చిన ఆఫీసరులా కనకయ్య అమాయకత్వంమీదికి విజృంభించాడు వెంకటస్వామి.

'ఏంలేదు దర్మప్పెబో. మల్లా నన్ను జైల్లో ఏయించండి. నా పేణాన్ని కాపాడండి.'

కనకయ్య తెలివిగలవాడవుతున్నట్లు తోచింది వెంకటస్వామికి. 'ఇహ పని కొస్తాడు' అని మనసులోనే అనుకొన్నాడు. అయినా అతని అభ్యర్థనను అంత సులభంగా అంగీకరించదల్చుకోలేదు.

'అదేమిటోయ్? జైలుకు పంపటమంటే అంత తేలికనుకొన్నావా? అయినా నువ్వేం నేరం చేశావని నిన్ను జైలుకుపంపటం? అలాటి అన్యాయాలు నాకు చాతకాదు బాబూ. నన్నలాటి కోరికలు కోరకు. నేనసలే సిన్సియర్ సర్వెంటును.'

'మరి ఆనాడు నన్నన్యాయంగా జైలుకెందుకు పంపించావు?' అని అడగలేదు కనకయ్య. అసలా ఆలోచనే రాలేదు. 'బాబ్బాబు. అలాగనకు. నిన్నే నమ్ముకున్నాను–' అని ప్రాధేయపడ్డాడు.

కాస్సేపలా బతిమిలాడించుకొని చివరికి మంత్రిలా అభయమిచ్చాడు వెంకటస్వామి 'చూస్తానని.'

* * *

హోటల్లోనుంచి బయటికొచ్చాడు కనకయ్య.

ఆకలి నోరుమూసుకొని నిద్రపోయింది. కోరికలు కళ్లు తెర్చుకొంటున్నాయి.

కిళ్లీ పట్టించాడు బుగ్గన. ఖరీదైన సిగరెట్టు కొని వెలిగించాడు. రోడ్డంతా ఓమారు స్వేచ్ఛగా కలయచూచాడు.

అందమైన ఆడదాని చిరునవ్వులా గాలి చల్లగా వీస్తోంది. ఎవరో పట్నంజంట చెట్టాపట్టా లేసుకొని, ఒకరికొకరు ఆధారంగా కల్సి నడ్చిపోతున్నారు విలాసంగా. రిక్షాలో పోతున్న ఓ పల్లెటూరి జంటలోని యువకుడు కనకయ్య చూస్తుండగానే ఆ పిల్ల బుగ్గమీద చిటికెవేసి చిరునవ్వు నవ్వేడు.

కనకయ్య ఆ దృశ్యాన్ని చూచి మొదట్లో సిగ్గుపడ్డాడు. ఆ తర్వాత ఆ దృశ్యాన్ని మరోసారి చూడాలన్న కోరిక గలిగింది. అదీ అయ్యాక తనే అలా చేయాలన్న వాంఛ కలిగింది.

కనకయ్య మళ్లీ బజారున పడ్డాడు. కోరికలు ఒక్కటొక్కటిగా ముడులు విప్పుకొంటున్నాయి.

ఎవడో తప్పతాగి 'అందమె ఆనందం' అని జల్సాగా పాడుకొంటూపోతున్నాడు.

ఓ యువతి కనకయ్యను చూచి నీడలోనుంచి వెల్తురులోకొచ్చింది. కనకయ్య తనవైపు చూడగానే జారవిడుచుకొన్న పమిటను మళ్లీ చటుక్కున వేసుకొని విలాసంగా నవ్వి చీకట్లోకి వెళ్లి నిల్చుంది.

వయసు......కోరికలు...

ఆశ...అవకాశం.

కనకయ్య జేబులు తడుముకొన్నాడు. వెంకటస్వామి యిచ్చిన అయిదులో భోజనానికి పోగా, మూడుపైన కాస్త చిల్లరుంది. అరగంట ఆనందానికి కది చాలకపోదు.

కనకయ్య కాళ్లు చీకట్లోకి వెళ్లి కూరుకుపోయాయి!

* * *

మత్తుగా తెల్లవారింది కనకయ్యకు.

రాత్రి మజా జ్ఞాపకం వచ్చింది. జేబులు తడుముకొన్నాడు అప్రయత్నంగానే. ఖాళీ!......మూడూ చిల్లరతో 'స్వర్గం'–రూపాయి 'ముంతకు', రెండు 'పిల్లకు'. స్వర్గం యింత చీప్ అయిన వస్తువా అనుకొని విస్తుపోయాడు!

హుషారుగా లేచాడు. మనసు, శరీరం, రాత్రి సుఖాన్నే మరీమరీ కోరుతున్నాయి. కానీ ఎలా?

'మీ దయవల్ల రాత్రి ఆయిగా గడ్చిపోయింది. మీ మేలు ఈ జనమంలో మర్చిపోను–' అన్నాడు వెంకటస్వామి వద్దకెళ్ళి.

వెంకటస్వామి చిద్విలాసంగా నవ్వేడు. కాస్సేపు కళ్లు మూసుకొని మౌనం వహించాడు.

'అయితే జైలు కెళ్తానంటావ్?' అన్నాడు చివరికి.

నెత్తిన పిడుగు పడ్డట్లయింది కనకయ్యకు!......రాత్రి అనుభవించిన ఆ సుఖం...ఆనందం...ఆ మజా...... కావాలి. సగం మాత్రమే చవిచూచిన ఆ స్వర్గానందాన్ని సంపూర్ణంగా అనుభవించాలి. అది జైల్లో ఎలా సాధ్యం?

'ఇష్టం లేదా ఏమిటి ఆలోచిస్తున్నావ్?'

కనకయ్య పెద్ద చిక్కులో పడ్డాడు. 'లేదు' అంటే ఆకలి – 'వుంది' అంటే జైలు!

వెంకటస్వామి అతని ఆలోచన్ని కనిపెట్టినవాడల్లే నవ్వుతూ అన్నాడు– 'నీ మొహం. ఒట్టి పుణ్యానికి నిన్నెవరు జైలుకు పంపిస్తార్లే. ఏదన్నా పనిప్పించమని ఓ పెద్దమనిషి నడిగాను. ఆయన మరెవర్తోనో మాట్లాడేడు. ఈ అడ్రస్ కాగితం తీసుకొని అక్కడి వ్యక్తిని కలు పని కావాలంటే వెళ్ళు.'

కనకయ్య ఆలోచించాడు. జైల్లో ఆకలి బాధ లేనిమాట నిజమే. కానీ ఈ సుఖాలు మాత్రం ఏవీ? బయట కష్టపడ్డా ఎంత ఆనందం?......ఎంత డబ్బుంటే అంత ఆనందాన్ని కొనుక్కోవచ్చు.

కాగితంతోపాటు వెంకటస్వామి ఇచ్చిన రెండురూపాయలు తీసుకొని బయటపడ్డాడు కనకయ్య.

* * *

హోటలు మెట్లెక్కబోతూ ఆగేడు కనకయ్య. గుప్పిట విప్పి రెండురూపాయల నోట్లను ఆప్యాయంగా చూచాడు. హోటలువైపు, ఆ నోట్లవైపు అలాగే రెండుమూడుసార్లు చూచి, 'ఛీ' అనుకొని మెట్లు చకచకా దిగేడు. 'స్వర్గం'వైపు నడిచాడు.

గుడిసె దగ్గరికెళ్తూనే ఆగిపోయాడు. నలిగిన బట్టలతో, బడలిక కన్నుల్తో, ఒళ్లు విర్చుకొంటూ, మత్తుగా ఆవలిస్తూ అప్పుడే బయటికొచ్చింది 'రాత్రి రంభ'. వాడిన ఆ రంభవైపు, నలిగిన రూపాయలవైపు



రెండుసార్లు చూచుకొని 'ఛీఛీ' అనుకొని పక్కనున్న పాతబడ్డ పెంకుటింట్లోకి దూరేడు.

అరగంట తర్వాత, తూలుతున్న కనకయ్య కాళ్ళు, తేల్తున్న మనసును వెంట బెట్టుకొని, అడ్రస్‌లోని యింటి కెళ్ళేయి.

'కనకయ్య నువ్వేనా ?' అన్నాడు చుట్ట కాలుస్తూ కుర్చీలో కూర్చొన్న ఓ పెద్దమనిషి.

'సిత్తం - యీడేనండి-' అన్నాడు కనకయ్య తనని చూపించుకొంటూ.

'ఏం పనిచేస్తావ్ నువ్వు ?'

'తమరేం సెయ్యమంటే అది-'

'రిక్షా తొక్కుతావా ?'

కనకయ్యకి వెనుకటి రిక్షా జీవితం గుర్తుకొచ్చింది. తల అడ్డంగా వూగింది.

'పోనీ కూలీ చేస్తావా ?'- తల అడ్డం తిరిగింది.

'మరి వ్యాపారం చేయగలవా ?'

తల అంగీకారంగా వూగింది. పెద్ద మనిషి నవ్వుతూనే అడిగాడు- 'వ్యాపారం అంటే ఏమిటో తెల్సా ?'

నిజానికి కనకయ్యకు తెలీదు. కానీ అలా అనలేదు. తెల్సునన్నట్లే తల వూపేడు.

'ఒకవేళ పోలీసులు పట్టుకొంటే ఏం చేస్తావ్ ?'

వ్యాపారం చేస్తే పోలీసులు ఎందుకు పట్టుకొంటారో అర్థం కాలేదు కనకయ్యకు. అయితే పోలీసులు పట్టుకొంటే ఏమౌతుందో అతనికి బాగా తెల్సు.

'జైలు కెళ్తానండి–' చటుక్కున అనేశాడు.

పాతికరూపాయల నోట్లు కనకయ్య చేతిలో రెపరెప లాడేయి !

*   *   *

పదిహేను రోజులు తెలీకుండా గడిచిపోయాయి కనకయ్యకి. ఈ పదిహేను రోజుల్లో కనకయ్య అలవాట్లలో, స్వభావంలో చాలా మార్పులు వచ్చాయి. డబ్బంటే లెక్కలేదు. తినటం – తాగటం...బాలామణి యింట్లో పడుకోటం...

డబ్బయిపోయినప్పుడు పెద్దమనిషి ముందు నిలబడటం. ఆయనే తెచ్చి యిచ్చేవాడు డబ్బు.

ఆయన ఎందుకిలా తనకి డబ్బిస్తున్నాడో, ప్రతిఫలంగా తనేం చేయాలో, వివరాలు కనుక్కోవాలన్న ఆలోచనే కనకయ్యకు రాలేదు.

తనకి డబ్బు కావాలి–ఆ యిచ్చేవాడక్కడ ఒక డున్నాడు – తీసుకోటం ... ఖర్చుపెట్టటం...అలా గడిచిపోయింది.

మనిషి ఒకసారి కాలుజారి, ఆ జీవితానికి బానిసైతే, ఎక్కడలేని ధైర్యంవస్తుంది. ఇహానికీ పరానికూ్కడా భయపడడు. కనకయ్య విషయంలోనూ సరిగ్గా అలాగే జరిగింది.

సుఖానికి బానిసైన పదహారో రోజు వుదయాన...

బాలామణి గడపదాటి రిక్షా ఎక్కి పొట్టి జేబులు తడుముకొన్న క్షణాన....

కనకయ్య మళ్లీ ఆలోచించటం మొదలుపెట్టేడు.

ఎందుకిస్తున్నాడా పెద్దమనిషి తనకింత డబ్బు ?

మొదట్లోనే ఎవరో అన్నారు. 'సారా యాపారంచేసే వాళ్ళకిదో యాపారంరా. సారా యాపారం సేస్తున్నారని ఆళ్ళను పట్టుకొంటే, ఆల్లబదులు కోర్టులో నువ్వునిలబడాలె. నువ్వే యీ యాపారం సేస్తున్నట్లు వొప్పుకొని సిచ్చ ననుబయించాలె.'

అప్పుడామాటల్ని పట్టించుకోలేదు కనకయ్య. కాగా తేలిగ్గా తీసుకొని నవ్వేశాడు.

ఆనాడు నవ్వి వదిలేసిన ప్రశ్నే యివాళ కొండంతై ఎదురుగ్గా నిల్చింది. ఆరోజు ఎవరో అన్నమాటలు యీ రోజు లక్షగొంతుకలతో విన్పిస్తున్నాయి.

నిజంగా అందుకేనా తనకు డబ్బియ్యటం? నిజమే అయితేమటుకు పోలీసులు తన్నెలా దోషిని చేయగలరు ?

ఆలోచిస్తూనే రిక్షాదిగి పెద్దమనిషి యింట్లో కెళ్ళేడు కనకయ్య.

ఎప్పటిలాగే చుట్టకాల్చుకొంటూ పడక్కుర్చీలో కూర్చొని వున్నాడా పెద్దమనిషి. తనని చూడగానే అలవాటు ప్రకారం లేచి వెళ్ళి డబ్బు పట్టుకొచ్చి యిస్తాడని ఆశించాడు కనకయ్య. కాని ఆయన కదల్లేదు.

చుట్టను మౌనంగా ఓ అయిదు నిముషాలు కాల్చి, తాపీగా అన్నాడు. 'మన బిజినెస్సుపైన రేపు దాడిచేస్తున్నారుటోయ్ పోలీసులు–'

'మన బిజినెస్సేమిటి? రేపే దాడిచేస్తారని మీకెలాతెల్సు ?' అని అడగాలనుకొంటున్నాడు కనకయ్య.

'మరి నువ్వు రేపు జైలు కెళ్ళాల్సి వుంటుంది.' వూరికెళ్ళమన్నంత సాధారణంగా అన్నాడు.

కనకయ్య శరీరం సుఖానికలవాటుపడింది. దాంతోబాటే ఒకనాడు పవిత్ర శరణాలయంగా కన్పించిన 'జైలు' ఎంత క్షుద్రమైనదో తెల్సివచ్చింది. యిప్పుడు తిరిగి తను అక్కడికి వెళ్ళటమన్నది వూహించరాని విషయం. అందులోనూ అన్యాయంగా–కారణం తెలీకుండా. అతని మనసు ఎదురుతిరిగింది.

'చమించండి. జైలుకు నే ఎల్లను–'

పెద్దమనిషి కనకయ్య వైపు చూచాడు నిశ్శబ్దంగా. ఒక్కనిమిషం ఆగి నిదానంగా 'వెళ్ళవూ?' అన్నాడు.

'వెళ్ళను,వెళ్ళను. అయినా నేనేం నేరం చేశానని వెళ్లాలి ? మీ బిజినెస్సేంటంట?' ఉద్రేకంగా అన్నాడు.

పెద్దమనిషి ఆశ్చర్య పోలేదు. కోప్పడలేదు. కనీసం నచ్చ చెప్పటానికికూ్కడా ప్రయత్నించలేదు. 'సరే నీ యిష్టం' అంటూ నెమ్మదిగా లోపలికెళ్లాడు.

ఆశ చచ్చిందాకా అక్కడే నిల్చొని, ఆ తర్వాత బాలామణి యింటికెళ్లేడు.

'డబ్బు లిచ్చాడా ?'

'లేదు. జైలుకెల్లాలంట–'

'ఎప్పుడంట ?'

'ఎప్పుడైతే మనకెందుకు? నేనెల్లనన్నా.'

'ఎల్లనన్నావా?' మరుక్షణంనుంచే బాలామణి మారిపోయింది. గొంగళి పురుగును చూచినట్లు చూచింది.

తిరిగి బజార్లు సర్వే చేయటం మొదలు పెట్టిన కనకయ్యకు ఓ గంటలోనే తెల్సి వచ్చింది. పొద్దున తనకున్న గౌరవం యిప్పుడులేదని–తన్నుచూచి ఎవరూ భయపడటంలేదనిన్నీ.

రెండు రోజులు గడిచాయి. పనిలేదు. ప్రయత్నాలన్నీ వ్యర్థమే అయ్యాయి.

ఇప్పుడొక్క ఆకలేకాదు – కోరికలు కూడా వేధించసాగాయి.

మూడోరోజు రాత్రి –

ఆకలి – కోరికల్ని, న్యాయమార్గాన్ని, నీతినీ, జయించిన క్షణాన–కనకయ్య మళ్లీ పెద్దమనిషి యింట్లో వున్నాడు.

పెద్దమనిషి యితన్నిచూచికూడా, చూడనట్లే మాట్లాడించలేదు. అవతల యింకొకరితో అరగంట మాట్లాడేడు.

చివరికి కనకయ్యే అన్నాడు–'జైలుకెల్లామనివచ్చాన్దొరా–'

'ఎందుకు ? ఎందుకురా ? జల్సాలుచేయి'

జవాబిచ్చే స్థితి ఏనాడో పోయింది కనకయ్యకు.

'కడుపు నిండితే ప్రతి వెధవా నీతీ, నిజాయితీ, న్యాయం, ధర్మం అని కబుర్లు చెప్పేవాడే ... వుద్యోగం కావాలనటానికి, వద్దని వెళ్ళటానికి అంతా నీ యిష్టమే సను

కొన్నావా ఏమిటి ? లక్షలు...లక్షల మంది వున్నార్రా...నేను చెప్తే జైలుకేకాదు. నరకానికి పొమ్మన్నా పోవటానికి సిద్ధంగావున్నారు. ఏదో పెద్దమనిషి రెకమెండ్ చేశాడు కదా అని పాపం తలిస్తే...అన్యాయం, న్యాయమని కబుర్లు చెప్తావా నా దగ్గర ?...సరేపో. మళ్లీ ఎందు కొచ్చావ్ ?'

'చమించండి. తాగిన నిషాలో పొరపాటున ఏవో కూసేను___'

'పోనీ యిప్పుడంటున్నవన్నీ తెల్సుకొనే అంటున్నావా ? ఆకలిబాధలో వున్నానంటావా ?'

'అన్నీ' అంటే ఏమిటో కనకయ్యకిప్పుడు బాగా తెల్సు. తను జైలుకెళ్లాలి. ఆరు నెలల తర్వాత తిరిగివస్తాడు. వచ్చాక ఓ నెలో రెండు నెల్లో హాయిగా జల్సాగా కాలం గడపొచ్చు. ఆ తర్వాత మళ్లీ జైలు. జైల్లోవున్న తన పేరన నెలకింత అని జీతం యిస్తారు. ఇదీ తన వుద్యోగం. ఇదీ యీ వ్యాపార ఆచారం.

'ఆఁ అన్నీ తెల్సుకొనే అంటున్నా. నేను జైలు కెల్తాను_'

పదిరూపాయల నోటు ఫెళఫెళమంటూ కనకయ్య చేతిలో కెళ్లింది.

* * *

రాత్రి అప్పుడే గడిచిపోయిందే అని విచారించాడు_తెల్లవారిన తర్వాత కనకయ్య.

పదకొండు గంటలకు బాలామణి కౌగిట్లో వున్న కనకయ్య పన్నెండున్నరకు పోలీసుల మధ్య వున్నాడు.

స్టేషనులో వెంకటస్వామి చిరునవ్వుతో స్వాగతం చెప్పేడు.



మరుసటిరోజు కోర్టులో నిల్చున్న కనకయ్య. సారా తాగినంత సుఖంగా, సులభంగా అబద్ధాలు చెప్పేడు.

'నువ్వు సారా వ్యాపారం చేస్తావా ?'

'సిత్తం. సేసేనండి.'

'చెయ్యకూడదని తెలీదా ?'

'అయ్య. తెలీదండి_'

'నువ్వు నిజమే మాట్లాడుతున్నావా ?'

'సిత్తం. అబద్ధాలాట్టం నా కేంసేతవుద్దండి ?'

కనకయ్య చెప్పిన అబద్ధాల నన్నిటిని నిజమేనని నమ్మేరేమో మరి కోర్టువారు. ఆరునెలల శిక్షలో, రెండునెల్లు తగ్గించి, నాలుగు నెలలు శిక్షవేశారు.

జైల్లోకి పోతూ అనుకొన్నాడు కనకయ్య. నీతిని అవినీతే జయిస్తోందని, నిజంకన్నా అబద్ధమే జీవితంలో రాణిస్తున్నదనినీ !

జైలుగోడలు లోకాన్ని చూచి ఫక్కున నవ్వేయి !

---